నమస్తే తెలంగాణ

రాజన్న సిరిసిల్ల

10 కరీంనగర్, గురువారం 6 ఫిబ్రవరి 2025 RAJANNA SIRCILLA


# రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని పట్టణంలోని గాంధీచౌక్‌లో మాట్లాడుతున్న పుట్ట మధూకర్

మంథని, ఫిబ్రవరి 5: రాష్ట్రంలోని బీసీ వర్గాలను అవమానపర్చేలా కులగణన రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీసీలకు స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని మోసం చేయడంతోపాటు బీసీల సంఖ్యను తగ్గించి అసెంబ్లీలో ఎలాంటి చట్టబద్ధత లేని కులగణన నివేదిక ప్రవేశపెట్టడంపై మండిపడ్డారు. బీసీ వర్గాలను అవమానిస్తూ అసెంబ్లీలో కులగణన రిపోర్ట్‌ను ప్రవేశపెట్టిన ఫిబ్రవరి 4ను చీకటి రోజుగా గుర్తించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం మంథని గాంధీచౌక్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడారు. దేశంలో ఏ ఉత్పత్తి జరగాలన్నా అది బీసీ వర్గాలతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అలాంటి బీసీలపై రేవంత్ సర్కారు నిర్ణయం సరికాదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎన్నికల మేనిఫెస్టోలో గొప్పగా చెప్పి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు జనాభా లెక్కలు చెప్పి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. బీసీలు, ఎస్సీల సంఖ్యను తక్కువగా చూపించి.. ఓసీల సంఖ్య పెంచి చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈడబ్ల్యూసీలో ఓసీలకు సమాన హక్కులు రావడానికి రిజర్వేషన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారని ఆరోపించారు. బీసీల్లో చైతన్యం రాదనే అహంకారంతోనే సీఎం అసెంబ్లీలో రిపోర్ట్‌ను ప్రవేశపెట్టి బీసీ వర్గాలను అవమానించారన్నారు. ముఖ్యమంత్రి చేయించిన కులగణన సర్వే పత్రాలను కొన్ని ప్రాంతాల్లో బీసీ వర్గాలు చించిపడ వేశాయంటే బీసీల్లో చైతన్యం వచ్చిందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అంటే కాంగ్రెస్ పార్టీకి నచ్చదని, మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మంథని ఎమ్మెల్యే తయారు చేసిన మేనిఫెస్టో దేశానికి మచ్చగా మారిందన్నారు. మంథని ఎమ్మెల్యే నాయకత్వంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యంతోపాటు తాజాగా కులగణన కూడా ఖూనీ అయిందని విమర్శించారు. హడావుడిగా ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనతోనే సీఎం అసెంబ్లీలో కులాల గురించి చర్చ పెట్టి వెళ్లిపోయాడన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేను కూడా వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. రాహుల్‌గాంధీ ఎన్ని రాజ్యాంగం పుస్తకాలు పట్టుకొని తిరిగినా కాంగ్రెస్ పార్టీని ఈ సమాజం నమ్మదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, మాచిడి రాజుగౌడ్, కాయితి సమ్మయ్య, శంకెసి రవీందర్, ఆకుల రాజబాపు పాల్గొన్నారు.


## సీఎం రేవంత్ రెడ్డి కుట్రకు నిదర్శనం



బీసీ జనాభాను తక్కువగా అగ్ర కులాల జనాభాను ఎక్కువ చేసి చూపడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రకు నిదర్శనం. కుల గణన చేస్తామని, ఆ ప్రకారంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఏరుదాటిన తర్వాత తెప్ప తగలేసినట్టు అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను విస్మరించింది. కుల గణనలోనే బీసీలకు అన్యాయం చేసింది. ఇదంతా ఫేక్ సర్వే. సర్వే పూర్తి స్థాయిలో జరగలేదా..? జరిగిన సర్వేలో కులాల సంఖ్యను తగ్గించారా..? అనేది బయట పడాలి. ఈ నివేదిక ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలి. ఎందుకంటే ఇది పెద్ద కుట్రగా మేం భావిస్తున్నాం. సర్వేలో ఎక్కడా క్లారిటీ లేదు. కులాల వారీగా విడుదల చేసిన జాబితాలో కూడా అన్ని తప్పుడు లెక్కలే కనిపిస్తున్నాయి. తక్కువ ఉన్న కులాన్ని ఎక్కువగా, ఎక్కువ ఉన్న కులాన్ని తక్కువగా చేసి చూపుతున్నారు. ఈ సర్వే వాస్తవానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. దీనిని రద్దు చేసి పూర్తి స్థాయిలో ఒక ప్రణాళికా బద్ధంగా సర్వే నిర్వహించి ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు చట్ట బద్ధంగా కల్పించాలన్నదే మా బీసీ సంఘాల ప్రధాన డిమాండ్. లేదంటే బీసీలు ఐక్య ఉద్యమాలు చేపట్టి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పక తప్పదు.

- మేకల చంద్రశేఖర్ యాదవ్, యాదవ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

# బీసీలకు మొండి 'చేయి'?




- 2024 జూన్‌లోనే చెప్పిన 'నమస్తే తెలంగాణ'
- అసెంబ్లీ ఎన్నికల్లో కట్టుకథలు అల్లిన కాంగ్రెస్
- స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ఆశలు
- తీరా చూస్తే కేంద్రంపై నెట్టిన రాష్ట్ర సర్కారు
- మండిపడుతున్న బీసీ నేతలు

కాంగ్రెస్ కపట నాటకం బయటపడింది. ఆ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండదన్న విషయం మరోసారి స్పష్టమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధికారికంగా 42 శాతం అమలు చేస్తామని చెప్పి, ప్రస్తుతం మాటమార్చిన తీరే అందుకు అద్దం పడుతున్నది. అలవి కానీ హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ఒక్కో హామీపై ఒక్కో పేచీ పెడుతూ వస్తున్న రేవంత్ సర్కారు.. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లకు కూడా అదే విధానాన్ని వర్తింప జేసింది. పార్టీ పరంగా కల్పిస్తామే తప్ప అధికారికంగా పంచాయతీల్లో అమలు చేయడం సాధ్యం కాదని కుండబద్ధలు కొట్టడమే కాదు, ఇప్పుడా బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టింది. నిజానికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్టు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయదని, దానికి అనేక అడ్డంకులున్నాయని, చివరికి రేవంత్ ప్రభుత్వం వాటినే సాకుగా చూపుతూ తప్పించుకుంటుందన్న వివరాలతో 'నమస్తే తెలంగాణ' గత జూన్24న ''బీసీలకు మొండి 'చెయ్యే'!'' శీర్షికన కథనం ప్రచురించింది. ఇప్పుడదే నిజమైంది! బీసీలకు రిక్త'హస్తం' చూపుతూ.. సర్కారు పూటకో మాట చెబుతున్న తీరుపై బీసీ సంఘాల నేతల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కామారెడ్డి డిక్లరేషన్‌కు పాతరేసి కొత్త పాటపాడుతుండడంపై మండిపడుతున్నది.

కరీంనగర్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎలాగైనా ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చేందుకు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం కురిపించింది. కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించింది. స్థానిక సంస్థల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. అక్కడితో ఆగకుండా ఆ వర్గాలను నమ్మించేందుకు అంకెల గారడీని ప్రదర్శించింది. 42 శాతానికి రిజర్వేషన్ పెంచడం వల్ల పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని స్పష్టం చేసింది. అంతేకాదు, బీసీ వర్గాల్లో ఉప కులాల వారీగా వర్గీకరణ చేసి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పింది. అందుకు బీసీ కుల గణన చేయాల్సిన అవసరముందని, ఇంటింటా సర్వే చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారంలోకి వచ్చిన తర్వాత చెబుతూ వచ్చింది. ప్రస్తుతం సర్వే పూర్తయింది. వివరాలు కూడా బహిర్గతమైన నేపథ్యంలో ప్రభుత్వం రూటు మార్చింది.

### మాట మార్చిన సర్కారు

ఇన్నాళ్లు సర్వే పూర్తయిన తర్వాత మేనిఫెస్టోలో చెప్పినట్టు రిజర్వేషన్లు అమలు చేస్తామని చెబుతూ వచ్చిన రేవంత్ సర్కారు, ఇప్పుడు ఏకంగా మాట మార్చింది. సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పకనే చెప్పింది. ఇది సాధ్యం కావాలంటే రాజ్యాంగ సవరణ జరగాలని, దీనికి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెబుతున్నది. అక్కడితో ఆగకుండా దీనిని కప్పిపుచ్చుకునేందుకు పార్టీ పరంగా ఈ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెబుతున్నది. అయితే అధికారంలోకి రాక ముందు ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌లో గానీ, అధికారంలోకి వచ్చిన 14నెలల్లో గానీ ఈ మాటలను సర్కారు ఎక్కడా చెప్పలేదు. ఇప్పుడు మాత్రం తన తప్పును దాచిపెట్టుకోవడానికి, ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి మేనిఫెస్టోలో ఒక హామీని చేర్చేముందే సాధ్యాసాధ్యాల గురించి ఆలోచన చేయాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న పరిస్థితులు, రిజర్వేషన్ల అమలు, సుప్రీంకోర్టు తీర్పుల వంటి వాటిని ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా.. నాటి నుంచి రెండు రోజుల క్రితం వరకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెబుతూ వచ్చిన రేవంత్‌సర్కారు, ఇప్పుడు మాట మార్చడంపై ఆయా వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

### ఆనాడే తేల్చిచెప్పిన కమిషన్?

కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం సాధ్యం కాదని ముందుగానే గత బీసీ కమిషన్ చెప్పినట్టు సమాచారం బయటకు వచ్చింది. అనధికారికంగా కూడా ఓ నివేదికను సమర్పించినట్టు తెలిసింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించడానికి వీలు లేదని, అందులోనూ రాజ్యాంగంలోని 243డీ అధికరణం ప్రకారం.. ఎస్సీలు, ఎస్టీలకు ఈ 50 శాతంలో ఆయా ప్రాంతాల్లో ఎంత జనాభా ఉంటే అంత జనాభాకు అనుగుణంగా సంబంధితవర్గాలకు ముందుగా రిజర్వేషన్ ఇవ్వాలని, ఆ తర్వాత మాత్రమే బీసీలకు ఇవ్వాలని కమిషన్ గతంలోనే సర్కారు దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. నిజానికి 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలో ఏ పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లను అప్పటి పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్రంలో ఖరారు చేశారు. దాని ప్రకారం చూస్తే బీసీలకు 22.79 శాతం, అలాగే ఎస్సీలకు 20.53 శాతం, ఎస్టీలకు 6.68 శాతం చొప్పున రిజర్వేషన్లు కల్పించి, ఈ ప్రకారమే ఎన్నికలు నిర్వహించారు. వీటన్నింటినీ లోతుగా అధ్యయనం చేసి చూస్తే.. ఏ పరిస్థితుల్లోనూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలయ్యే అవకాశాలే కనిపించడం లేదని, బీసీ డిక్లరేషన్ ఒక రిక్తహస్తంగానే మారే అవకాశాలున్నాయని జూన్ 24న 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించింది. ఇప్పుడు అదే జరుగుతున్నది. కాగా, ప్రభుత్వ తీరుపై బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఇన్నాళ్లు ఆశలు రేపి, ఇప్పుడు మాత్రం పార్టీ పరంగా అమలు చేస్తామని చేతులెత్తేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### అది అసమగ్ర సర్వే



తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదిక తప్పుల తడకగా ఉంది. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతం ఉండగా, పదేండ్ల తర్వాత బీసీ జనాభాను 46 శాతంగా చేపి ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుంది. 7 శాతంగా ఉన్న అగ్ర కుల జనాభాను మాత్రం 15 శాతంగా చూపించి, బీసీలపై కుట్ర చేస్తున్నరు. బీసీల జనాభా తగ్గించడం కాంగ్రెస్ కుట్రలో ఒక భాగమే. బీసీలను రాజకీయంగా అణగదొక్కే కుట్ర చేస్తున్నరు. ప్రస్తుత సర్వే ఫలితాలను పూర్తిగా సమీక్షించి నిజమైన గణాంకాలను వెల్లడించాలి. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి.

- దావ వసంత, జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్

### బీసీ వర్గాలకు న్యాయం చేయాలి



జనాభా పరంగా దేశంలో అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు దక్కాలంటే సమగ్ర కులగణన సర్వే జాతీయ స్థాయిలో అవసరం. భవిష్యత్తులో నిర్వహించే జనాభా గణనలో కులగణనను కూడా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని మా టీబీసీ జేఏసీ తరపున డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే కేంద్రం ఆమోదిస్తేనే అమలవుతుంది. 42 శాతం కోటా కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. బీసీలకు సబ్ ప్లాన్ పెట్టాలి. నివేదికకే పరిమితం కాకుండా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయిలో అమలు చేసి బీసీ వర్గాలకు న్యాయం చేయాలి.

- హరి అశోక్ కుమార్, టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

### బీసీలపై కాంగ్రెస్ కుట్ర



కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణన సర్వే నివేదిక తప్పుల తడక. 56 శాతానికి పైగా ఉన్న బీసీలను 46.2 శాతంగా చూపిస్తారా? సర్వే పూర్తికాకుండానే లెక్కచెప్పడం వెనుక కుట్ర ఉన్నది. బీసీలకు రిజర్వేషన్ల పెంచాల్సి వస్తదని తూతూ మంత్రంగా సర్వే చేయడం బాధాకరం. మన రిజర్వేషన్లు సాధించుకోవడానికి బీసీ కులసంఘాలు ఏకమై పోరాటం చేయడానికి సిద్ధం కావాలి. 42 శాతం కోటా ఇవ్వకుంటే రణరంగమే అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యా, ఉద్యోగ రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలి. లేదంటే ఆమరణ నిరాహారదీక్ష చేపడుతాం.

- ముసిపట్ల లక్ష్మీనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి

### నివేదికలు కాదు చట్టం తేవాలి



ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణనకు సంబంధించి నివేదికలు సమర్పించి చేతులు దులుపుకొన్నారు. అసలు నివేదికలు కాదు, పకడ్బందీ చట్టం తేవాలి. గత కేసీఆర్ ప్రభుత్వ లెక్కలకు ఈ ప్రభుత్వ లెక్కలకు చాలా తేడాలు కనిపిస్తున్నాయి. బీసీల సంఖ్య తగ్గించి చూపడం అన్యాయం.

- గూడూరి ప్రవీణ్, టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ (సిరిసిల్ల)

### మూల్యం చెల్లించుకోక తప్పదు



కులగణన సర్వే ఫలితాల్లో తీవ్రమైన గందరగోళం నెలకొంది. బీసీ జనాభా తగ్గించి చూపడంపై తక్షణమే సమగ్ర సమీక్ష జరపాలి. గతంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల జనాభా 52 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నది. ప్రస్తుత కుల గణనలో బీసీల జనాభా 46.25 శాతం చూపించడం ఏమిటి? ఓసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింల జనాభా పెరుగుతుంటే.. బీసీ జనాభా శాతం మాత్రం తగ్గినట్టు చూపించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. 2011 తెలంగాణ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.7 కోట్లుగా ఉంటే, సర్వేలో 3.54 కోట్ల మందిగా లెక్కించారు. 2011 సెన్సెస్ ప్రకారం తెలంగాణ యావరేజ్ పాపులేషన్ గ్రోత్ 13.5 శాతం. గత లెక్కల ప్రకారం బీసీ జనాభా సుమారు కోటి 84 లక్షలు, తెలంగాణ యావరేజ్ గ్రోత్ రేటు 13శాతం. ఆ లెక్కన సుమారుగా 36లక్షల జనాభా పెరిగి 2కోట్ల 20లక్షల బీసీ కుటుంబాల లెక్కలు రావాలి. కానీ, కావాలని తప్పుడు లెక్కలు చూపించి బీసీ జనాభాను కోటి 64 లక్షలకు తగ్గించి చూపించారు. సర్వేలో విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ వాసుల లెక్కలు తీయలేదు. గతంలో ఓసీల జనాభా 10శాతం లోపే అని చెబుతుండగా, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ కాపాడుకునేందుకు ఇప్పుడు 15.79శాతంగా చూపించారనే అనుమానాలు కలుగుతున్నాయి. 10శాతం కంటే తక్కువ ఉన్న ఓసీలు 15 శాతానికి పెరిగితే, బీసీల జనాభా శాతం మాత్రం పెరగకుండా ఎలా ఉంటుంది? ఈ సర్వే ఫలితాలను తక్షణమే సమీక్షించి, పూర్తి పారదర్శకతతో నిజమైన గణాంకాలను వెల్లడించాలి. లేదంటే రాష్ట్ర వ్యాప్త బీసీ ఉద్యమం తప్పదు.

- ఆకుల స్వామి వివేక్ పటేల్, బీసీ సంఘం జాతీయ నాయకుడు (పెద్దపల్లి జిల్లా)



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

# 42శాతం అమలు చేయాల్సిందే

బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 5: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. లేకపోతే పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు చీపుర్లతో కాంగ్రెస్ నాయకులకు సత్కారం చేస్తారని హెచ్చరించారు. సొంత పార్టీ నాయకులే రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడం లేదని.. ఓ బఫూన్‌లా మాత్రమే చూస్తున్నారని విమర్శించారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రిపై లేనివిధంగా 70కి పైగా కేసులు రేవంత్‌పై ఉన్నాయని, చార్‌బీస్ నంబర్ సైతం ఆయనను చూసి సిగ్గుపడుతున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం కేసీఆర్‌ను పొగుడుతున్నారంటే అంతటి గొప్ప నాయకుడు మరొకరు లేరని అభివర్ణించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేసిన సమయంలో మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవడన్నా తన కుటుంబ వివరాలు చెప్తారా..? ఎవరైనా ఇంటికొచ్చి అడిగితే తన్ని పంపండి అని ఆనాడు రేవంత్‌రెడ్డి మాట్లాడాడని గుర్తుచేశారు. ఆ రోజు విమర్శలు చేసిన ఆయన.. ఈ రోజు తలకాయ ఉండే కులగణన సర్వే చేశాడా..? అని ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న సామాజిక న్యాయం దినంగా గుర్తించాలని చెబుతున్నారని, తాము మాత్రం అవగాహన రాహిత్య దినంగా భావిస్తున్నామన్నారు. కామారెడ్డిలో జరిగిన సభలో 42శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలుచేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సర్వే పేరిట ఏడాది కాలయాపన చేశారని మండిపడ్డారు. సర్వేపేరిట స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పదేండ్ల క్రితం 60శాతం బీసీలుంటే తన సర్వేలో 10శాతం తగ్గించి చూపించారని ఆగ్రహించారు. రేవంత్‌కు మద్దతుగా కేంద్ర మంత్రులు డబ్బా కొడుతున్నారని విమర్శించారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ వర్గీకరణ కోసం జరిగిన పోరాటం అభినందనీయమని కొనియాడారు. గతంలో కేసీఆర్ అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రానికి అందజేసి.. వర్గీకరణ అమలు చేయాలని కోరారని గుర్తు చేశారు. మాదిగ రిజర్వేషన్లు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు మ్యాన రవి, కుంబాల మల్లారెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, గజభీంకార్ రాజన్న, గుజ్జుల రాజిరెడ్డి, జంగిటి అంజయ్య, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

### బీసీ కుల గణన బూటకం



రాష్ట్రంలో బీసీలను అణచి వేసేందుకు కుట్రలు చేస్తున్నరు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన తర్వాత చేపట్టిన కులగణన పూర్తిగా బూటకం. అగ్ర కులాలకు ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లను కాపాడుకునేందుకే బీసీ కులాలను తక్కువ చేసి చూపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 51 శాతం ఉన్నారని వెల్లడైతే, ఇప్పుడు 46 శాతమే ఉన్నారని ప్రకటించడంలో పెద్ద కుట్ర కోణం ఉన్నది. అగ్ర కులాల సంఖ్యను ఎక్కువ చేసి చూపి, తమను తక్కువ చేసి చూపడాన్ని బీసీ కులాలు తట్టుకోలేక పోతున్నాయి. ఒక్క తెలంగాణ రాష్ట్రంలో బీసీల కుల గణను సరిగ్గా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం, రేపు కేంద్రంలో అధికారంలోకి వస్తే బీసీల ఉనికి లేకుండా చేస్తుందనే అనుమానం కలుగుతున్నది. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బీసీ కులాల సంఖ్య తగ్గింది. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వ, సీఎం రేవంత్ రెడ్డి చేసిన అతిపెద్ద కుట్రగానే భావించాల్సి వస్తోంది.

- గుంజపడుగు హరిప్రసాద్, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

### కులగణన సర్వే తప్పుల తడక



బీసీ కులగణన అనేది తప్పుల తడక. ఇంతకు ముందు చేసిన సర్వేలో ఎక్కువ వచ్చి, ఇపుడు తక్కువ రావడం ఏమిటి? 2014లో చేసిన సర్వేలో బీసీ కులాలు 51 శాతం ఉన్నట్టు తేలగా, 2024లో చేసిన సర్వేలో 46 శాతం ఎలా వస్తుంది? కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ బీసీలను మోసం చేస్తున్నది. ఇది బీసీ వ్యతిరేక ప్రభుత్వమని చాలా స్పష్టంగా తెలిసిపోయింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడేందుకు అగ్రకుల జనాభాను పెంచి చూపడంలో పెద్ద కుట్ర జరిగింది. మమ్మల్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పతనం తప్పదు. ఈ విషయమై బీసీలందరినీ చైతన్య పరుస్తాం. బీసీ సబ్ కమిటీలో బీసీ మంత్రులు ఉంటే బాగుండేది. అగ్ర కులానికి చెందిన ఉత్తమ్ కుమార్ ఉన్నప్పుడే మాకు అనేక అనుమానాలు వచ్చాయి. ఇప్పుడు ఆ అనుమానాలు బలపడుతున్నాయి. బీసీలను అణచివేసే కుట్రకు కాంగ్రెస్ పాల్పడుతున్నది. బీసీల జనాభా ఎంతన్నది ముందు తేలిన తర్వాతనే రిజర్వేషన్లు ఖరారు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి. లేదంటే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదు.

- ఎన్నం ప్రకాశ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు



ఎల్లారెడ్డిపేట: ఎరువుల కోసం క్యూ కట్టిన రైతులు

### పంటలు ఎట్ల పండుతయ్



ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన్రు. ఒక్కరికీ ఎవుసంపై అవగాహన లేదు. పంటలకు ఏటైంల ఎరువులు ఇయ్యాలో తెల్వదు. అదనులో ఇయ్యకపోతే ఎట్ల పండుతయ్. కాంగ్రెస్ పాలనలో ఎప్పుడూ ఎరువుల కొరతనే. అరకొరగా ఇస్తే రైతు నష్టపోతడు. పెట్టిన పెట్టుబడులు ఎల్లక ఆగమైతడు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను పట్టించుకోవాలె. ఆత్మహత్యల బాట పట్టకుండా ఆదుకోవాలె.

- పసుల బాబు, రైతు (పెద్దలింగాపూర్)

# యూరియా కోసం తిప్పలు

ఎల్లారెడ్డిపేట/ ఇల్లంతకుంట, ఫిబ్రవరి 5: యూరియా కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. నాట్లు వేసి రెండు నెలలైనా దొరక్క నిరీక్షిస్తున్నారు. ఎక్కడ యూరియా వచ్చిందని తెలిసినా అక్కడకు పరుగెత్తుతున్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పడిగాపులు గాశారు. ఎల్లారెడ్డిటపేట పీఏసీఎస్ గోదాంకు లోడ్ వచ్చిందని తెలియగానే పోతిరెడ్డిపల్లి, రాగట్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, హరిదాస్‌నగర్, దుమాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పరిస్థితిని గమనించిన అధికారులు పోలీసుల సాయంతో యూరియాను పంపిణీ చేశారు. పలుకుబడి ఉన్నోళ్లకే యూరియా ఇస్తున్నారని కొందరు రైతులు హమాలీలతో గొడవకు దిగారు. దీంతో మరో లోడు వస్తుందని చెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అలాగే ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ పీఏసీఎస్ గోదాం వద్ద కూడా బారులు తీరారు. సిరికొండ, దాచారం, రామోజిపేట, చిక్కుడువాని పల్లి, అనంతగిరి, తెనుగువానిపల్లికి చెందిన రైతులు ఉదయం నుంచే పడిగాపులు గాశారు. రైతులకు సరిపడా లేకపోవడంతో కొందరు నిరాశతో వెనుదిరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు ఎరువులు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### నాల్గు రోజులైంది ఇంకా ఇయ్యలే



యూరియా కోసం నాలుగు రోజుల సంది తిరిగినా ఇయ్యలే. యూరియా వచ్చిందని చెప్పంగనే దుమాలకెయి ఆగమాగమచ్చిన. వచ్చె సరికి యూరియ అయిపోయిందంటరు. మల్ల లోడు వత్తుందంటున్రు. లోడు వచ్చెదెప్పుడో, ఇచ్చుడెప్పుడో. రైతులను గోసగోస జేత్తున్రు.

-పెరుమాల్ల రాములు, రైతు (దుమాల)